క్లుప్తంగా

విద్యార్థినులకు ఐరన్ మాత్రల పంపిణీ



విద్యార్థినులకు ఐరన్ మాత్రలు అందజేస్తున్న కనకమహాలక్ష్మి, నాగజ్యోతి

అల్లిపురం: ఆదివారం విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అల్లిపురం మోడల్ స్కూల్లో కొంత మంది విద్యార్థినులు నీరసంగా ఉన్నట్లు గుర్తించారు. సెలవుల్లో వారి ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని, తగినంత ఐరన్ ఫుడ్ తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కనకమహాలక్ష్మి తెలిపారు. తల్లిదండ్రులు వారికి పౌష్టికాహారం అందజేయాలని కోరారు. ఆశ వర్కర్ డి.జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ప్రతి రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్ తరువాత ఒకటి, రాత్రి భోజనం తరువాత ఒకటి చొప్పున తీసుకోవాలని సూచించారు.

‘ఆరోపణలు రుజువు చేయాలి’



మాట్లాడుతున్న నీలి సుందరరాము

డాబాగార్డెన్స్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసుకున్న బ్యానర్‌ను తొలగించారని జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్ కాలనీకి చెందిన నీలి సుందరరాము వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అంతే కాక గ్రామ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రశ్నించినందుకు తనపై రూ.10 లక్షల రూపాయలకు సంబంధించి వార్డు నాయకులు చేసిన ఆరోపణలు రుజువు చేయాలన్నారు.

సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: విశాఖ ఉక్కు మనదే.. హక్కూ మనదే.. స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపుతూ ప్రధాని మోడీ ప్రకటన చేయాల్సిందేనని డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు, వంద శాతం ఉత్పత్తి జరిగేలా ఆర్థిక ప్యాకేజీపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. పక్కి నాగేశ్వరరావు, భానోజీ, గ్రెగరీ, గణేష్, చైతన్య, వాసు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి చక్కటి పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ నెల 8 నుంచి జూన్ 16 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, చదివిన పుస్తకంపై సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, డ్యాన్స్, డ్రామా, బొమ్మలు తయారు చేయడం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవితలు సజీవం

జగదాంబ: శ్రీశ్రీ కవితలు సజీవమని ప్రముఖ కవి సత్తివాడ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మహాకవి శ్రీశ్రీ 113వ జయంతిని పురస్కరించుకుని జగదాంబ సెంటర్ సీతానిలయంలో ఆయనకు నివాళులు అర్పించారు. ఈ శతాబ్దం మాత్రమే కాదు వెయ్యేళ్ల వరకు శ్రీశ్రీ రచనలు సజీవంగా ఉంటాయన్నారు. ఇమంది నందకిశోర్, బొట్టా మహేష్, సూరిబాబు, జుత్తాడ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణ

మహారాణిపేట: హనుమాన్ చాలిసా పారాయణాన్ని ఆదివారం ఎంవీపీ కాలనీ భద్రం కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, సామూహిక పారాయణం సాగింది. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

శ్రమిద్దాం..
శ్రమను గౌరవిద్దాం

ప్రపంచ కార్మిక దినోత్సవం అంటే కార్మికులందరికీ ఓ పండగ. కానీ లక్షలాది మంది కార్మికులకు మేడే అనేది జీవితంలో ప్రశ్నార్థకంగా మారింది. వేలాది మంది కార్మికులకు భరోసా లేని జీవితంగా.. భద్రత.. రక్షణ లేని పయనంగా ఉంది. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుండి రాత్రి పొద్దుపోయే వరకు యంత్రాల్లా కష్టపడే కార్మికుల జీవితాలు పొగచూరిపోతూనే ఉన్నాయి.

- మెరుగైన జీవనం కోసం కార్మికుల ఎదురు చూపులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



భద్రత లేకుండా బతుకులీడుస్తున్న కార్మికులు

డాబాగార్డెన్స్: కష్టానికి ప్రతిరూపమైన కార్మికులకు హక్కులుండవు. చట్టాలు వర్తించవు. పనిచేసే ప్రాంతంలో రక్షణ ఉండదు. వారి జీవితానికే గ్యారంటీ లేదు. ఇదీ మన అసంఘటిత రంగ కార్మికుల దీనగాథ..

లక్షలాది మంది కార్మికులకు భరోసా ఏదీ?

దక్షిణ నియోజకవర్గ పరిధిలో సుమారు 80 వేల మందికి పైగా అసంఘటిత రంగ కార్మికులున్నారు. ఆటో రంగంలో 6 వేల మంది, ముఠా కార్మికులుగా 5 వేల మంది, భవన నిర్మాణ కార్మికులుగా 5 వేల మంది, ఇంటి పనివారిగా వెయ్యి మంది, కాంట్రాక్ట్ వర్కర్లుగా 2 వేల మంది, ప్రైవేట్ సెక్యూరిటీగా వెయ్యి మంది, పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న వారు 500 మంది, షాప్ వర్కర్స్ (వివిధ దుకాణాల్లో పని చేస్తున్న వారు)గా 5 వేలమంది ఉంటే.. వీరు కాక ఎంతో మంది కార్మికులు వివిధ కర్మాగారాలు, పరిశ్రమల్లో డైలీవేజ్ కింద పని చేస్తున్నారు. వీరికి పనిచేసే ప్రాంతంలో భద్రత.. రక్షణ లేదు. ప్రమాదాలు, మరణాలు సంభవిస్తే కాంట్రాక్టర్లు స్పందించరు. కనీస వేతనాలు కూడా ఉండవు.



భద్రత లేకుండా బతుకులీడుస్తున్న కార్మికులు

అవగాహనతో రక్షణ

కార్మికుల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు, సొకర్యాలు, పథకాలు నిర్వహిస్తున్నాయి. అయితే వాటి గురించి పూర్తిగా తెలియక కార్మికులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. ముందుగా వాటిపై కార్మికులు కనీస పరిజ్ఞానం కలిగి ఉంటే ఎన్నో మేళ్లు జరుగుతాయి. తాము చేస్తున్న పనికి సంబంధించి ఎటువంటి బెనిఫిట్స్ దొరుకుతాయి.. ప్రభుత్వం ఏ సందర్భంలో ఎలా ఆదుకుంటుందో పూర్తి అవగాహన కలిగి ఉండాలి. అలాగే అధికారులు కూడా మానవతా దృక్పథంతో కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న చట్టాలు, హక్కులు, పథకాల గురించి అవగాహన కల్పించాలి. ప్రమాదాలు, మరణాలు సంభవించినప్పుడు కార్మికులకు, వారి కుటుంబాలకు అండగా నిలబడాలి. ఇలా చేస్తే ప్రతి కార్మికుడికి, అతని కుటుంబానికి న్యాయం జరుగుతుంది.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఛాయా, ఉషా సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి



సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా అభిషేకం చేసి, అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వైశాఖ మాసం సందర్భంగా స్వామికి భక్తులు మామిడి పండ్లు సరి ఎంచుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది



ఉక్కు పరిరక్షణ కమిటీ సభ్యులకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అల్లిపురం: విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయనను విశాఖ ఉక్కు పరిరక్షణకు యూనియన్ సంఘాలు ఆదివారం కలిసాయి. ఈ సందర్భంగా ఆయన సంఘాల పోరాటానికి సంఘీభావం తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలను ఆయన యూనియన్ నేతలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారానికి అందరం కృషి చేద్దామని సూచించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కెఎస్ఎన్‌రావు, ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న ఆర్యవైశ్య మహిళలు



స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞానమండలి, ఆర్యవైశ్య సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వివిధ వాసవీ క్లబ్‌ల సంయుక్త సహకారంతో కార్యక్రమం అట్టహాసంగా జరిపారు. 146 సంవత్సరాల చరిత్ర గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేకువజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, స్వర్ణ వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర కథా గానామృతం, వాసవీ మూలమంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. వాసవీమాతను హంసవాహనంపై ఊరేగించారు. శోభాయాత్ర కనులపండువగా సాగింది. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీధరాల మధు, కొల్లూరు వెంకటరత్నం, కట్టమూరి ప్రసన్న, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతి గృహంలో వైద్య సేవలు



నిరాశ్రయ వసతి గృహంలో వైద్య సేవలు అందజేస్తున్న సత్యసేవా సంస్థ ప్రతినిధులు

అల్లిపురం: ఏయూటీడీ, జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద గల నిరాశ్రయ వసతి గృహంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ ప్రారంభించారు. మొత్తం 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా బిపిన్ జైన్, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సత్యసేవా సమితికి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సాహంగా మే డే వేడుకలు

అల్లిపురం : మే డే సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహం నిర్వహించారు. సుమారు 50కి పైగా ప్రదర్శనలతో కళాకారులు, ప్రజాసంఘాలు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగం వరకు ఉపాధ్యాయులతో సహా వివిధ రంగాలకు చెందిన కార్మికులు సుమారు 200 మంది వరకు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాభారతి ఆడిటోరియం అధ్యక్షుడు ఎంఎస్ ఎన్ రాజు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ దుర్గాప్రసాద్, మల్లీశ్వరి ఆర్ట్స్ ఛైర్మన్ కొరటాల ప్రభాకరరావు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సెక్రటరీ మేడా మస్తాన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. కార్యక్రమానికి అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి దండు నాగేశ్వరరావు, షార్ట్ ఫిల్మ్స్ ఇన్‌చార్జి ఎం.ఎల్లాజీ పాల్గొని కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

దోషులకు శిక్ష పడే వరకు పోరాడుదాం

డాబాగార్డెన్స్: వాకపల్లి ఆదివాసీ మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన దోషులకు శిక్ష పడేంత వరకు పోరాడుదామని ప్రగతి శీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. 2007లో లైంగిక దాడికి గురైన ఆదివాసీ మహిళలు 16 ఏళ్ల పాటు పోరాటం సాగించి తమపై దాడి జరిగిందని కోర్టు ద్వారా నిరూపించారన్నారు. కానీ దోషులకు శిక్షలు పడలేదని వక్తలు ఆందోళన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, న్యాయవాదులు పల్లేటి అప్పారావు, కె. పద్మ, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : ఏపీ జేఏసీ (అమరావతి) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. పరిశీలకుడిగా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా సత్తి నాగేశ్వరరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఆర్టీసీ), అసోసియేట్ చైర్మన్‌గా ఎస్.ఎ.త్రినాథరావు (రెవెన్యూ, డిప్యూటీ తహసీల్దార్), వైస్ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు (దివ్యాంగుల శాఖ), నమ్మి శ్రీనివాసరావు (నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం), సీహెచ్ రామకృష్ణమూర్తి (భాషా పండితుల సంఘం), వైస్ చైర్మన్ (ఉమెన్ వింగ్) డాక్టర్ పూర్ణిమ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసెస్ అసోసియేషన్) కార్యదర్శి కె.సురేష్‌కుమార్(గ్రామవార్డు సచివాలయాలు), ఎ.శ్రీనివాసరావు (పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్), కార్యదర్శి ఎన్.మేఘ శ్యామ్ వెంకటేష్ యాదవ్ (ఏపీ స్టేట్ లేబర్ డిపార్టుమెంట్), కార్యదర్శిగా పీయూఎస్ మహేష్ (ఏపీ రెవెన్యూ అసోసియేషన్), కార్యదర్శి (ఉమెన్ వింగ్) ఆర్.అనూష (ఏపీ రూరల్ వాటర్ సప్లైస్ ఇంజినీర్స్), కోశాధికారిగా బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్) తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

డాబాగార్డెన్స్: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని చెంగల్రావుపేట అగ్రహారం వీధిలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం పంజా జంక్షన్, టౌన్‌కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్, టౌన్ హాల్ రోడ్డు మీదుగా తిరువీధి ఉత్సవం జరిపారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, గోడి నరసింహాచారి అఖండ దీపారాధన జరిపారు. మధ్యాహ్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ చేతుల మీదుగా పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాటోజు ప్రసాద్, కార్యదర్శి ధర్మవరపు వరంబాబు, విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురజాపు రవి, కార్యదర్శి పండూరి శేఖర్, కోశాధికారి బక్కపాటి శ్రీను, విశాఖ నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ముదపాక రవి, కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, కోశాధికారి ఈర్ని ప్రకాష్, రామోజు పెదబాబు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవానికి అంకురార్పణ

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవానికి ఆదివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనసేవ, నూతన వస్త్రాలంకరణ చేశారు. స్వామి వారిని, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను, పెండ్లి కుమారుడిగా తీర్చిదిద్దారు. సాయంత్రం దేవస్థానం మండపంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు, వేదపండితులు ఉత్సవ సంకల్పం చేపట్టారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది రాంబాబు, రవి భక్తులు పాల్గొన్నారు. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు.

పుస్తకాలకు విరామం

- విద్యార్థుల్లో సెలవుల జోష్
- ఆఖరి తరగతిలో ఉపాధ్యాయులతో మమేకం



విద్యార్థులతో మమేకమైన జీవీఎంసీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

అల్లిపురం: ఆదివారం ఆఖరి రోజు స్కూలుకు విద్యార్థులు ఉల్లాసంగా తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం పాఠశాలలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరితో ఒకరు మమేకమయ్యారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి చేసుకుని, హైస్కూల్ విద్యలో ప్రవేశించే అల్లిపురం మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉద్వేగంగా మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా ఇదే స్కూల్లో చదివిన తాము ఇప్పుడు స్కూలు మారాలంటే కాస్త బాధగా ఉందన్నారు. ఉన్నత చదువులకు అలా చేయడం తప్పదు కాబట్టి వేసవి సెలవులు సరదాగా గడపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కనకమహాలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. క్రీడలు, సంగీతం, డ్రాయింగ్ వంటి వాటిని నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సెలవుల్లో ఏయే ఊళ్లు వెళతారు, ఏం చేస్తారు అడిగి తెలుసుకున్నారు.

తాతయ్య ఇంటికి వెళతా..



ఈ వేసవి సెలవుల్లో నేను మాతాత గారి ఊరు రామభద్రపురం వెళతాను. అక్కడ మా అమ్మమ్మ, తాతయ్య, మామయ్యలతో చక్కగా ఆడుకుంటాను. తోటల్లో తిరుగుతూ సరదాగా గడుపుతాము. –బి.తేజేశ్వరరావు, 5వ తరగతి విద్యార్థి

మాది ఈ ఊరే..



నేను ఎక్కడికీ వెళ్లను. మా ఊరు విశాఖపట్నమే. ఇక్కడే రామ్‌నగర్‌లో మా ఆంటీ వాళ్లు ఉన్నారు. అక్కడికి వెళతాను. విశాఖపట్నంలో చూడదగ్గ ప్రదేశాలన్నీ చూస్తాను. మన సిటీలో చూడాల్సిన స్థలాలు చాలా ఉన్నాయి. –బి.రేవతి, విద్యార్థిని

బీహార్ వెళతా..



నేను మా సొంత ఊరు బీహార్ వెళతాను. అక్కడ సరదాగా గడిపి వస్తాము. ప్రతి ఏడాది అక్కడికి వెల్లడం నాకు చాలా ఇష్టం. అక్కడ చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. –వై.బిట్టుకుమార్ యాదవ్

మేము షిర్డీ వెళతాం



మా కుటుంబం అంతా కలిసి ఈ వేసవి సెలవులకు షిర్డీ వెళతాం. అలాగే అజంతా, ఎల్లోరా గుహలు, నాసిక్, ముంబయి వంటి ప్రదేశాలను చూసి వస్తాము. –జి.నవ్యశ్రీ, విద్యార్థిని

క్రికెట్ అకాడమీ ప్రారంభం



క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: క్రీడలతో ఉద్యోగావకాశాలు పొందవచ్చని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం సోల్జర్‌పేట వద్ద క్రికెట్ అకాడమీని ప్రారంభించిన ఆయన చాల మంది క్రీడాకారులు గల్లీ నుంచి వచ్చిన వారేనన్నారు. అటువంటి వారందరూ ఇప్పుడు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. క్రీడల్లో చిన్నారులను ప్రోత్సహిస్తే వారు కూడా పెద్ద క్రీడాకారులుగా మారుతారన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్ వద్ద బీజేపీ చలివేంద్రం ఏర్పాటు చేసింది. దీనిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సురేష్‌బాబు, జిల్లా సెక్రటరీ కొప్పిశెట్టి శంకరరావు, కోరాడ వెంకటరమణ, వీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

డాబాగార్డెన్స్: పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సేవ్ ఎర్త్ మిషన్‌లో భాగంగా విద్యార్థులకు ఎస్ వరల్డ్ సంస్థ డ్రాయింగ్ పోటీలు నిర్వహించింది. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ వరల్డ్ వైజాగ్ వారియర్స్ షేక్ రహ్మాన్, ఎంఎ ఆంతోనీపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏవీఎన్ పూర్వ విద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో బీఎస్సీ సీబీజెడ్ డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుంటూ ఎంజాయ్ చేశారు. చదివిన తరగతి గదిలో ఆ విద్యార్థులంతా బెంచీలపై కూర్చుని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా కళాశాల బోటనీ అధ్యాపకురాలు లక్ష్మి, సంధ్యశ్రీ, విభాగధిపతి సంతోషి సత్య, ప్రస్తుత ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడును సత్కరించారు. కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అంతే కాక శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులంతా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయంలో అవకతవకలపై ఆరా



భక్తులతో మాట్లాడుతున్న ఏసీ శిరీష

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం వద్ద టెంట్ల నిర్వహణ, ఆలయ సిబ్బంది తీరుపై ఆదివారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష ఆరా తీశారు. ఆలయంలో జరుగుతున్న అవకతవకలపై సిబ్బందిని విచారించారు. ఇటీవల హుండీలో సిబ్బంది నగదు చోరీ నుంచి ప్రతిరోజు గొడవలు జరుగుతుండడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈవో సురేష్‌బాబా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో సిబ్బంది భక్తుల మౌలిక వసతుల కల్పన పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని పలువురు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్న టెంట్లకు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు భక్తులు వాపోయారు. వీటిపై విచారించి నివేదికను దేవదాయశాఖకు అందించనున్నట్లు ఏసీ శిరీష తెలిపారు.

టైమ్‌ల్యాండ్ వాచ్ షోరూం ప్రారంభం



వాచ్ షోరూం ప్రారంభానికి విచ్చేసిన నటి నిధి అగర్వాల్

డాబాగార్డెన్స్: నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్ దరి వాల్తేర్ అప్‌లాండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన టైమ్‌ల్యాండ్ వాచ్ షోరూంను ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నటి నిధి అగర్వాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం యజమాని షోయబ్ మాట్లాడుతూ 1965లో తమ తాత జనాబ్ ఇస్మాయిల్ నెల్లూరులో స్థాపించిన చిన్న వాచ్ దుకాణం అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. తండ్రి షేక్ ఇంతియాజ్ హయాంలో ఖాతాదారుల ఆదరణ, ప్రోత్సాహంతో నెల్లూరు పట్టణంలో మదీనా వాచ్ షోరూం పేరిట 4 షోరూంలు ఏర్పాటు చేశారన్నారు. టైటాన్, షాసిల్, హెచ్ఎమ్‌టీ, క్యాసియో, సిటిజెన్, సీకో, టైమెక్స్, రోలెక్స్, ఒమెగా వంటి ప్రముఖ బ్రాండ్ల వాచ్‌లు తమ వద్ద లభిస్తాయని తెలిపారు.